క్లుప్తంగా

జిల్లా కార్యదర్శి గోవిందరావుకు సత్కారం


గోవిందరావును సత్కరిస్తున్న ఎంపీపీ, ఇతర నాయకులు

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన బొడ్డు గోవిందరావును సత్కరించారు. చామంతిపురం సర్పంచ్, నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్‌గా కొనసాగుతున్న గోవిందరావును రెండో సారి జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మూకల మాలకృష్ణ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చంటిరాజు, రుత్తల నాయుడు పాల్గొన్నారు.

పీఎంపీవీటీజీ అభివృద్ధి మిషన్‌లో చేర్చాలని వినతి


ఐటీడీఏ పీవోకు వినతి పత్రం అందిస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

రావికమతం: ప్రధానమంత్రి పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్ పథకంలో తమను భాగస్వాములు చేయాలని అనకాపల్లి జిల్లాలో పలు మండలాలకు చెందిన పీవీటీజీలు పాడేరు ఐటీడీఏ పీవోను కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆ పథకం ద్వారా రూ.15 వేల కోట్లతో ఆదిమ తెగలుగా గుర్తించిన గ్రామాలకు కనీస సౌకర్యా లు కల్పించేందుకు నిర్ణయించిందన్నారు. ఈ దృష్ట్యా తమను ఆదిమ తెగలుగా గుర్తించి తమ గ్రామాలను ఆ జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లి కల్యాణ్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ అజయ్‌కుమార్, కార్యదర్శి మోసూరు రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు

కె.కోటపాడు: స్వామినాథన్ కమిటీ సిపార్సులను అనుసరించి రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కె.కోటపాడులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుండటం అన్యాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర వ్యతిరేక నిర్ణయాలపై ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణ ప్రారంభం


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సీఆర్పీ రామారావు

రావికమతం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్షకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టి.అర్జాపురం క్లస్టర్ సీఆర్పీ గుంటూరు రామారావు ఉచిత శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయన ఏటా ఉచిత శిక్షణ ఇస్తుంటారు. స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తుంటారు. ఆయన వద్ద శిక్షణ పొందిన ఎంతో మంది నవోదయ, పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూళ్లలో సీట్లు పొందారు. అక్టోబరులో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నేపథ్యంలో టి.అర్జాపురంలో శిక్షణ ప్రారంభించారు.

నేడు వెండి కిరీటం బహూకరణ

గొలుగొండ: మండలంలో ఇలవేల్పు దేవాలయంగా పేరున్న లింగంపేట నూకాలమ్మకు గొలుగొండ గ్రామానికి చెందిన కుంత్సం కుటుంబ సభ్యులు శనివారం వెండి కిరీటం బహూకరించనున్నారు. రూ.ఐదు లక్షలతో ఈ కిరీటాన్ని తయారీ చేసి అమ్మవారికి కానుకగా ఇవ్వనున్నట్టు వారు తెలిపారు.

నేడు రహదారి విస్తరణపై సమావేశం

అనకాపల్లిటౌన్: స్థానిక నూకాంబిక ఆలయ ఆర్చ్ నుంచి పవన్ సిటీసెంటర్ వరకు రోడ్డును విస్తరించనున్నట్లు జెడ్సీ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఇరువైపులా ఉన్న భవన యాజమానులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


మాడుగుల: అలంకరణలో దేవీతల్లి


నర్సీపట్నం: సౌభాగ్యలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు


నర్సీపట్నం: దుర్గామల్లేశ్వరసామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

వరాలనిచ్చే మహాలక్ష్మే మా వరలక్ష్మి

వరాలందించే తల్లి వరలక్ష్మీదేవిని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా గ్రామగ్రామాన అమ్మవారి వ్రతాన్ని ఆచరించారు. సకల శుభాలు, సిరిసంపదలు కల్పించాలని వేడుకున్నారు. ముత్తయిదువులకు తాంబూలాలిచ్చి ఆశీస్సులు స్వీకరించారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు


బుచ్చెయ్యపేటలో పూజలందుకుంటున్న వరలక్ష్మి దేవి


రావికమతం: చినపాచిల వైష్ణోదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


రోలుగుంట సిద్ధి వినాయక ఆలయంలో అభిషేకాలు చేసుకుంటున్న భక్తులు

నర్సీపట్నం: వరలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఇళ్ల వద్ద వ్రతాలు చేసుకున్న మహిళలు దుర్గాదేవిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ నెలకొంది. అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సౌభాగ్యలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనం...

ఆలివేలిమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారిని సౌభాగ్య లక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ బ్రహ్మలింగేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శరత్ కుమార్ చార్యులు సామూహిక కుంకుమార్చన చేయించి, ప్రసాద వితరణ గావించారు.

రావికమతం: మండలంలోని అన్ని ఆలయాల్లోనూ, ఇంటింటా శ్రావణ మాస పూజలు భక్తులు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. గురువారం నుంచి పూజా సామగ్రి కొనుగోలు అమ్మకాలుతో బిజీగా గడిపారు. శుక్రవారం ఉదయమే పలు రకాల పిండివంటలు చేసి మహాలక్ష్మికి నివేదించి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రావికమతం, కొత్తకోట, మరుపాక తదితర గ్రామాల్లోని వైష్ణోదేవి, దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రోలుగుంట: మండలంలో దుర్గమ్మ, వినాయకుడు, హనుమాన్ దేవాలయాల్లో రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం చేసుకున్నారు. దీనిలో భాగంగా స్థానిక సిద్ధ వినాయకుడు ఆలయంలో భక్తులు వరుణుడి కటాక్షం కోసం పూజలు చేశారు. వర్షాలు కురిసి ఎండిపోతున్న నాట్లకు, వరినామడులకు ఊపిరిపోయాలని వేడుకున్నారు.

మాడుగుల: పట్టణంలోని దేవీతల్లి ఆలయంలో రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, నగలుతో అలంకరించారు. గ్రామానికి చెందిన బొంగరాల రాము, కృష్ణవేణి దంపతులు అమ్మవారికి రూ.20 నోట్లతో దండ అలంకరించారు.

గొలుగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మిదేవి వ్రతం ఆచరించారు. చీడిగుమ్మల, గొలుగొండ, ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట ప్రాంతాల్లో కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజించారు.

మాకవరపాలెం: మండలంలో వరలక్ష్మీదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాకవరపాలెం, తామరంలో దుర్గాదేవి ఆలయాల్లో మహిళలంతా ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలో వరలక్ష్మిదేవి వ్రతం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లలో వరలక్ష్మి దేవి ప్రతిమలకు తమ శక్తికొద్దీ బంగారు కాసులు అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి రాత్రికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గణేష్ దంపతులు

నర్సీపట్నం: పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. ఆయన్ను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన సతీమణి కళావతి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ దంపతులు

భక్తిశ్రద్ధలతో సంతోషిమాత మాలధారణ


మాలాధారణ చేసిన భక్తులు

మాడుగుల రూరల్: శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో కె.జె.పురం సంతోషిమాత ఆలయంలో మహిళలు పసుపు, కుంకుమలో పూజలు చేశారు. చీరలు, బంగారుకాసులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లి నాయుడు పర్యవేక్షణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆలయంలో కె.జె.పురం, మాడుగుల, ఘాట్‌రోడ్డుకు చెందిన 53 మంది భక్తులు సంతోషిమాత మాలధరించారు. వచ్చే నెల 2వ తేదీ వీరికి భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

రూ. 70 లక్షలతో చురుగ్గా తాగునీటి పథకం పనులు


పెదగొలుగొండపేటలో తాగునీటి పనులు

నాతవరం: పెదగొలుగొండపేట గ్రామంలో తాగునీటి పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులకు ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.70 లక్షలు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు ఖరారు చేశాక స్థలాభావ సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ చొరవతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పునాదులు తీసి ఐరన్ కట్టి కాంక్రీటు పనులు చేస్తున్నారు. ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజనీరింగ్ అధికారులు స్వయంగా పరిశీలించి కాంట్రాక్టరుకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీటి పథకం ఏర్పాటుతో ఇంటింటికీ కుళాయి నీటిని అందించనున్నారు. వేసవిలో ప్రస్తుతం బోర్ల నుంచి అవసరమైన నీరందక ఇబ్బందులు పడేవారు. తాజాగా పనులు పూర్తయితే ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు.

20 ఏళ్లు దాటిన డీ పట్టా రైతులను గుర్తించండి


తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 20 ఏళ్లు దాటిన డీపట్టా భూములకు జిరాయితీ హక్కు కల్పించేందుకు క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన వీఆర్వోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అసైన్డ్ భూములకు సంబంధించి నిబంధనలకు క్లుప్తంగా వివరించారు. 2003 జూన్ 30వ తేదీకి ముందు డీపట్టా పొందిన రైతుల భూములకు ప్రభుత్వం జిరాయతీ హక్కు కల్పిస్తుందన్నారు. మండలంలో 42 రెవెన్యూ గ్రామాల్లో ఇటువంటి సాగుదారులను గుర్తించాలన్నారు. ఎలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు జగనన్న భూరక్ష రీసర్వే వేగవంతం చేయాలని, ఇంతవరకు ఎనిమిది రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు చైన్లు, నరేంద్ర, సర్వేయర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం

అనకాపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పార్టీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అనకాపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశనకుర్తి అప్పారావు, ప్రధాన కార్యదర్శి కందికుప్ప గోవిందరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షునిగా రౌతు శంకర్రావు నియామకంపట్ల వారు పార్టీకి, అధినేత, సీఎం జగన్‌కు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఎస్.రాయవరం మండలానికి చెందిన శంకర్రావు విశ్రాంత ఉపాధ్యాయుడు. వృత్తిరీత్యా శ్రీకాకుళం జిల్లాలో స్థిరపడిన ఆయన వైఎస్సార్‌సీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. దీనిని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనకు ఉపాధ్యక్షునిగా పదవినిచ్చి, గౌరవించడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఆయన నియామకం పట్ల జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలంతా హర్షం ప్రకటించారు. తమకు సముచిత గౌరవం ఇస్తున్న వైఎస్సార్‌సీపీకి తాము కూడా అదే విధమైన మద్దతును అందిస్తామని తెలిపారు.

గుండెపోటుతో శివాలయ అర్చకుడు మృతి


వెంకట సూర్య శంకరం

కశింకోట: కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి(శివాలయం) వంశపారంపర్య అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్య శంకరం(78) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో శివైక్యం పొందారు. అతనికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శివాలయంలో పూజారిగా సుమారు 60 ఏళ్ల నుంచి విధులను నిర్వర్తిస్తున్నారు. ఉదయం అర్చకత్వం నిర్వహించి, తన తండ్రి కొండలరావుకు వార్షిక తద్దిన రోజు కావడంతో తర్పణాలు ఇచ్చేందుకు సమాయత్తమవుతూ అకస్మాత్తుగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు దర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

90 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు


కేజేపురంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: విశాఖకు చెందిన హెచ్‌సీజీ ఆస్పత్రి సౌజన్యంతో కాళ్ల మురళీధర్, చిన్నారి దంపతుల ఆధ్వర్యంలో కేజేపురంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మురళీధర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా ధూమపానం, మద్యపానం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అనుమానం ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారించవచ్చునన్నారు. ఈ శిబిరంలో 90 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, కాళ్ల జగన్, కాళ్ల అమ్మతల్లినాయుడు, కాళ్ల రాము, ఆడారి సన్యాసినాయుడు, శంకర్, కిశోర్, బి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కిలపర్తికి డిప్యూటీ సీఎం అభినందన

దేవరాపల్లి: నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావును, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి సన్యాసిరావు (లలితానాయుడు)ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం దేవరాపల్లిలో డిప్యూటీ సీఎంను వీరు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. భాస్కరరావు, లలితానాయుడులను పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తదితర నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి తమవంతుగా కృషి చేస్తామన్నారు.

కాలిబాటల ఏర్పాటుతో తెగుళ్ల నివారణ


చిరికివానిపాలెంలో కాలిబాటల ఏర్పాటుతో వరినాట్లు వేస్తున్న కూలీలు

కె.కోటపాడు: వరి సాగులో రైతులు కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే తెగుళ్లు నివారించవచ్చని భార్గవ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ చైర్మన్ లాలం అచ్చింనాయుడు తెలిపారు. వారాడ క్లస్టర్ గ్రామాల్లో రైతులకు కాలిబాటల ఏర్పాటుతో వరినాట్లు వేయడం వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. అడుగు మేర కాలిబాట ఏర్పాటు చేసుకోవాలని, పంటకు ఆశించే తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చునని సూచించారు. గాలి, వెలుతురు, సూర్యరశ్మి తగలడం వల్ల పంట ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మందుల పిచికారీ చేయడానికి సులువుగా ఉంటుందని సూచించారు. అధిక దిగుబడితో కూడిన పంట వస్తుందన్నారు.

బాలుడి వైద్యానికి అంబేడ్కర్ ట్రస్టు ఆర్థిక సాయం


బాలుడు తల్లిదండ్రులకు చెక్కు అందచేస్తున్న ట్రస్టు సభ్యులు

చోడవరం రూరల్: మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ ట్రస్టు ఆర్థిక సాయమందించి మానవత్వాన్ని చాటుకుంది. పట్టణంలోని మెలిపాక తారకేశ్వరరావు కుమారుడు హేమాన్విత్ (3) మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ బాలుడి బ్రెయిన్ ఆపరేషన్‌కు రూ.4 లక్షల ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించారు. దీంతో పేదవారైన తారకేశ్వరరావు దంపతులు అంత ఖర్చుతో వైద్యం చేయించలేని స్థితిలో ఉన్నారని అంబేడ్కర్ ట్రస్టు సభ్యులు తెలుసుకున్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో బాలుడు తల్లిదండ్రులకు రూ.25 వేల చెక్కు అందజేశారు. ట్రస్టు వితరణకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్ చైర్మన్ నడుపూరి సన్యాసిరావు, మేనేజింగ్ ట్రస్టీ నడుపూరి దేయుడు, కార్యదర్శి ఎర్రంశెట్టి వరప్రసాద్, కోశాధికారి దొమ్మిసి వెంకటగిరి, ట్రస్టు సభ్యులు టెలికాం బోర్డు డైరెక్టర్ వేచలపు ప్రకాశరావు, హెచ్‌ఎం కండేల వెంకటరావు, జుంజూరు అప్పారావు పాల్గొన్నారు.

28 కాలనీల్లో విద్యుత్ లైన్ల పూర్తి


విద్యుత్ లైన్ల ఏర్పాటు

మాకవరపాలెం: మండలంలోని 28 జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు పూర్తి చేసినట్టు ఆ శాఖ ఏఈ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. మండలంలోని 31 పంచాయతీల పరిధిలో 32 లేఅవుట్లకుగాను 28 లేఅవుట్లలో విద్యుత్ లైన్ పనులు పూర్తి చేశామన్నారు. 46 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు అందజేస్తున్నట్టు చెప్పారు.

ఈదురు గాలులతో వర్షం

ఖరీఫ్ సాగుకు ఊపిరిపోసిన వైనం


నాతవరం మండలంలో కురుస్తున్న వర్షం


బుచ్చెయ్యపేటలో కురుస్తున్న వర్షం


కొత్తకోటలో కురుస్తున్న వర్షం


రోలుగుంట: కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట: మండలంలో శుక్రవారం గాలివాన కురిసింది. ఈ గాలివానకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఎండ కాసింది. ఐదు గంటల ప్రాంతంలో వాతావరణం చల్లబడి చిరుగాలులతో వర్షం కురిసింది. నెల రోజులుగా మండలంలో వర్షం కురవకపోగా వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. ఖరీఫ్ వరినాట్లుకు నీరందక పొలాలు బీటలు వారుతున్నాయి. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వరుణుడు కరుణించి జోరు వానలు కురిస్తే పంటలు బాగా పండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రావికమతం: కొత్తకోట సమీప గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చాలా రోజులుగా ఈ ప్రాంతంలో వర్షం కురవలేదు. పైగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వరినాట్లు, నారు మడులు సైతం ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఈదురు గాలులతో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నాతవరం: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి తీవ్రంగా ఎండ కాచి వాతావరణంలో మార్పుతో ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది. తాండవ రిజర్వాయరు నుంచి ఈనెల 10న ఆయకట్టుకు నీరు విడుదల చేయడంతో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసుకుంటున్నారు. ఎంత తీవ్రత కారణంగా ఆశించిన విధంగా నీరు ప్రవహించక దమ్ములు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో వర్షం కురవడంతో ఖరీఫ్ సాగు రైతులకు ఊరట కలిగింది. ఇదే విధంగా వర్షాలు కురిస్తే వరినాట్లు వేగవంతం కావడమే కాకుండా తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుందని రైతులు, ప్రాజెక్టు అధికారులు ఆశిస్తున్నారు.

రోలుగుంట: మండలంలో శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షంతో నారుమడులకు ఊపిరి పోసినట్టయింది. పక్క మండలాల్లో వరినాట్లయినా సాగునీటి వసతి లేని రోలుగుంటలో ఇప్పటికీ 20 శాతం వరినాట్లు వేయలేదు. దీనికి తోడు వేసవికి తలపిస్తున్న ఎండలతో నారుమడులు ఎండిపోయాయి. పల్లపు ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రోలుగుంట, కొండపాలెం, వడ్డిప తదితర గ్రామాల్లో నీటి మోటార్లతో నారుమడులను తడిపి సంరక్షించుకున్నారు. దీనికి తోడు శుక్రవారం సాయంత్రం వరకూ ఎండ కాసి ఒక్కసారిగా చల్లబడి చిన్నపాటి వర్షం పడడంతో నారుమడులకు జీవం పోసినట్టయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు పాటు వర్షాలు పడితే మేలు కలుగుతుందని చెబుతున్నారు.

సూరిశెట్టికి అభినందనలు


రమణ అప్పారావుకు కృష్ణుడి విగ్రహాన్ని అందిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సూరిశెట్టి రమణ అప్పారావును శుక్రవారం ఆయన స్వగృహంలో జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రమణ అప్పారావు నియామకం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు రమణ అప్పారావుకు జిల్లా యువజన నాయకులు కర్రి మహాలక్ష్మినాయుడు, సత్యదేవ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ లక్ష్మీనర్సింహారావు, బొడ్డేడ కిరణ్, 82వ వార్డు యువజన నాయకులు బొడ్డేడ కిరణ్, విల్లూరి సంతోష్, చోడవరం పార్టీ వెలమ విభాగం నేత జూరెడ్డి పృధ్విరాజ్‌లు దుశ్శాలువ కప్పి, కృష్ణుని విగ్రహాన్ని బహూకరించారు.